క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు అందుకున్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో గల శ్రీ వరసిద్ధి వినాయక, శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ 19వ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్థానికులు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకాలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. మహోత్సవాల సందర్భంగా సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి దుర్గాలమ్మ ఉత్సవాలు



వలందపేటలోని దుర్గాలమ్మ వనంలో అమ్మవారి మండపం

తగరపువలస : జీవీఎంసీ 2వ వార్డు, భీమిలి రూరల్ పరిధిలోని వలందపేట గ్రామస్తులు సోమవారం నుంచి మూడు రోజులపాటు దుర్గాలమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉన్న గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాలు జరుపుకుంటారు. ఈ సందర్భంగా వలందపేట నుంచి శివారులోని అమ్మవారి వనం వరకు గ్రామాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం అమ్మవారికి తొలేళ్లు, మంగళవారం అనుపోత్సవం సందర్భంగా బాణసంచా, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. బుధవారం పండగ ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మూడు రోజులపాటు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఘనంగా ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వార్షికోత్సవం

తగరపువలస : భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు, హిందీ మాధ్యమాలలో వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 48 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా గెలుపొందిన వారికి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

జంక్షన్లలో ట్రాఫిక్ కష్టాలు

- శ్రీ లెఫ్ట్ మార్జిన్‌పై వాహనాల నిలిపివేతతో ఇబ్బందులు
- మధురవాడ, పరిసర కూడళ్లలో వాహనదారులకు అవస్థలు



జాతీయ రహదారిపై మధురవాడ కూడలిలో ట్రాఫిక్ పోలీస్ బాక్స్ పక్కనే మార్జిన్‌పై వాహనాలు

మధురవాడ : మధురవాడతోపాటు పరిసర ప్రాంతాల్లోని జంక్షన్లలో వాహనదారులను ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ మార్జిన్లపై కొందరు వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో అటుగా వాహనదారులు వెళ్లేందుకు వీలుపడడం లేదు. మధురవాడలోని క్రికెట్ స్టేడియం, కార్‌షెడ్, కొమ్మాది, మారికవలస, బోయిపాలెం జంక్షన్లలో వాహనాలు జాతీయ రహదారితోపాటు సర్వీసు రోడ్లపై కూడా కిలో మీటరుపైన నిలిచిపోతున్నాయి. నిత్యం ఇలానే వాహనాలు నిలిచిపోతున్నా ట్రాఫిక్ పోలీసులు మార్జిన్స్ మీద వాహనాలు ఆపకుండా కనీస చర్యలు చేపట్టడం లేదు. హెల్మెట్ లేకపోవడం, సిగ్నల్ జంపింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ తదితర అంశాలపైనే ఫొటోలు తీసి చలానాలు వసూలు చేయడంపై శ్రద్ధ చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వందలాది మీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నా కనీస చర్యలు చేపట్టడం లేదని పలువురు వాపోతున్నారు.

- ముఖ్యంగా కొమ్మాది జంక్షన్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తే... ఇక్కడ విశాఖపట్నం – కార్‌షెడ్ నుంచి జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు అక్కడి నుంచి పక్కనే ఉన్న ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాయి. రెడ్ సిగ్నల్ పడిన తర్వాత పక్కనే పాసింగ్ కోసం కుడి వైపున ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ మార్జిన్లపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపి వేయడంతో వెళ్లలేకపోతున్నారు. అదేవిధంగా ఎడమ వైపు కొమ్మాది డబుల్, మధురవాడ సర్వీసు రోడ్డు వైపు వెళ్లే వాహనాలు కూడా సిగ్నల్ వచ్చేంత వరకు ఆగి... పక్క నుంచి వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల హైవేపై తిన్నగా వెళ్లిపోవాల్సిన వాహనాలకు కూడా పక్కకు తిరిగే వాహనాల వల్ల సమయం వృథా అవుతోంది. ఈ సమయంలో ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. కార్‌షెడ్, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, బోయిపాలెం తదితర సిగ్నల్స్ వద్ద ఇలాంటి ఇబ్బందులే ఎదురవుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.కాంతారావు మాట్లాడుతూ ఫ్రీ లెఫ్ట్ మార్జిన్‌పై వాహనాలు నిలిపివేయడం ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయం మా దృష్టిలో వుందని, తక్షణమే చర్యలు చేపడతామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యమైన సిగ్నల్స్ వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాలని... ప్రస్తుతం సిబ్బంది కొరత ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న కొమ్మాది జంక్షన్



ట్రాఫిక్ స్తంభించడంతో మధురవాడ సర్వీసు రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు



కొమ్మాది జంక్షన్ వద్ద మార్జిన్‌పై నిలిపిన వాహనాలు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



మచ్చవానిపాలెంలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస : ఆనందపురం మండలం మచ్చవానిపాలెం, పల్లిపేట, బంటుపల్లి వారి కళ్లాల్లో పద్మనాభం మండలం విజయరాంపురం హిందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను వివరించారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మను తెలుసుకుని మధ్యాత్మ ఆరాధనతో ధర్మం స్థాపించాలని కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, వి.భవానీ, బి.అంకమ్మ, కె.లక్ష్మి, జి.భారతి, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

గాలిలో నిఘా నేత్రం



రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద గాలిలో తేలుతున్న సీసీ కెమెరా

కొమ్మాది : బీచ్ రోడ్డు రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గాలిలో తేలియాడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు ఈ కెమెరాలు గాలిలో తేలుతున్నాయి. ఇది ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వీటికి కాస్త సమీపంలో విద్యుత్ దీపాలు కూడా గాలిలో తేలియాడుతున్నాయి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పక్షవాత పునరావాస కేంద్రంపై అవగాహన

తగరపువలస : ఆనందపురంలో గ్రామీణ వైద్యులకు ఆదివారం వైద్య విజ్ఞాన సదస్సులో భాగంగా పక్షవాత పునరావాస కేంద్రాల గురించి అవగాహన కల్పించారు. నగరానికి చెందిన న్యూరో వైద్యుడు బి.సునీల్‌కుమార్ గ్రామీణ వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ మెదడుకు సంబంధించిన వ్యాధులు ఎలా వస్తాయి..?, వాటిని నిర్మూలించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు జంగం జోషి, కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి కోన ప్రకాష్, జిల్లా కార్యదర్శి కె.ఎస్.రావు, ఆనందపురం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు, జోనల్ కార్యదర్శి పచ్చిపులుసు కనకారావు, రామకోటేశ్వరరావు, పడాల వినోద్, కాంచన, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము హల్‌చల్

తగరపువలస : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలో ఆదివారం పది అడుగుల నాగుపాము హల్‌చల్ చేసింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని ఉన్న తుప్పల ద్వారా పైకి చేరుకున్న పాము కొంతసేపు స్థానికులను ఆందోళనకు గురి చేసింది. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

కబ్జాదారుల బరి తెగింపు



గంభీరం పంచాయతీలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



కబ్జాదారులు హెచ్చరిక బోర్డు తొలగించిన తర్వాత దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలంలో కబ్జాదారులు బరితెగించి ప్రభుత్వ భూములను చెరపడుతున్నారు. జాతీయ రహదారి పక్కన ఖరీదైన భూములను గుర్తించి చదును చేసి విక్రయించేస్తున్నారు. వీరికి రెవెన్యూ అధికారులు నిస్సిగ్గుగా సహకరిస్తున్నారు. గంభీరం పంచాయతీలో ఇదేవిధంగా విలువైన భూమిని ఆక్రమించిన కబ్జాదారులపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది తూతూమంత్రంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇదేమీ పట్టని కబ్జాదారుడు బోర్డును పక్కన పడేసి మళ్లీ చదును చేస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూములను రక్షించడానికి భీమిలి ఆర్డీవో స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు, డ్రైనేజీలు లేక అవస్థలు



రోడ్లు, డ్రైనేజీలు లేని శ్రీబాసర లే అవుట్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు శ్రీబాసర లే అవుట్‌లో డ్రైనేజీలు, రహదారులు లేక ఇక్కడి అపార్ట్‌మెంట్ వాసులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ లే అవుట్‌లో 300 కుటుంబాల వరకు అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేని కారణంగా రహదారులు గతుకులమయమయ్యాయి. సాధారణ రోజుల్లో దుమ్ముధూళితో, వర్షాకాలంలో బురదతో ఈ లే అవుట్ నిండిపోయి ఉంటుంది. గతంలో డ్రైనేజీలు, రహదారులు నిర్మిస్తామని ప్రతిపాదనల దశలో వదిలేసిన జీవీఎంసీ అధికారులు ఇకనైనా వసతులు కల్పించాలని స్థానిక నివాసులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న నృత్య రూపకం



శిల్పారామంలో సాయి చరిత్ర నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లోని కళా వేదికపై ప్రదర్శించిన శ్రీసాయిచరిత్ర కూచిపూడి నృత్య రూపకం ప్రేక్షకులను అలరించింది. నగరంలోని జోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. శ్రీ షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలను కళ్లకు కట్టినట్టు నృత్య రూపకంలో ప్రదర్శించారు. కళాకారులు కేశవ్, అన్నపూర్ణ, మోహన్, సంజన, రమ్య, యశశ్రీ, భాసిత, ఆశాలత, చిన్ని, ప్రసన్న, శిరీష, హాష్య, సౌజన్య తదితరులు నృత్యం చేయగా మురళీ గోవింద నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక ఏవో విశ్వనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నిత్యావసర సరకుల సాయం



బాధిత కుటుంబానికి సరకులు అందిస్తున్న తెలగా సంఘం ప్రతినిధులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ కొత్తపేటకు చెందిన అంజూరు అప్పారావు ఇటీవల ప్రమాదానికి గురై కాలు విరిగిపోయింది. ఇంటికే పరిమితమైన అప్పారావుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో రంగూరి ఈశ్వరరావు, శెట్టి లీలావతి, కృష్ణారావుల ఆర్థిక సాయంతో బాధితునికి తెలగా సంఘం ప్రతినిధులు ఆదివారం నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నార్ల వాసు, వైస్ ప్రెసిడెంట్ రంగూరి వెంకట గిరిధర్, మేకల శ్రీనివాస్, నక్కాన రమేష్, శెట్టి ధీరజ్, శివ నారాయణరావు, జల్లు సంతోష్, మేకల రమేష్, నడుపూరు చందు, తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ స్థానంలో మెకానిక్ షెడ్



చిట్టివలస సబ్‌స్టేషన్ సమీపంలో బస్ షెల్టర్ కోసం కేటాయించిన స్థలంలో మెకానిక్ షెడ్

తగరపువలస: జాతీయ రహదారుల విస్తరణ సమయంలో తగరపువలస వాసులకు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బస్ షెల్టర్ నిర్మాణానికి కొంత స్థలం కేటాయించి వదిలేశారు. రెడీమేడ్ షెల్టర్ ఏర్పాటుకు అనువుగా డ్రైనేజీపై పెద్ద సిమెంట్ దిమ్మ ఏర్పాటు చేసి ఐరన్ బయటకు వదిలేశారు. జాతీయ రహదారుల విస్తరణ పూర్తయి మూడేళ్లు గడచినా షెల్టర్ నిర్మాణం ఊసే లేకుండా పోయింది. దీంతో స్థానిక మెకానిక్‌లు ఈ దిమ్మను, స్థలాన్ని వాహనాల మరమ్మతులు, రెడీమేడ్ షాపుల తయారీకి వినియోగిస్తున్నారు. దీంతో డ్రైనేజీ క్లీనింగ్‌కు ఇబ్బందిగా ఉండటమే కాకుండా ఈ మార్గంలో నడిచి వెళ్లేవారికి కష్టంగా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ బస్ షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గోతులతో ప్రయాణికుల అవస్థలు



గోతులు పడిన కృష్ణాపురం రోడ్డు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం రోడ్డు గోతులమయమైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగనన్న కాలనీకి సమీపంలో రోడ్డుపై గోతులు పడడంతో వర్షం నీరు నిలిచిపోతోంది. వర్షపు నీటితో నిండిపోయిన గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వీటిని పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోడంతో ప్రయాణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఈ గోతులను మట్టితో తాత్కాలికంగా కప్పుతున్నా కొద్ది రోజులకే యథావిధిగా తయారవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గోతులను తారుతో పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లోక కల్యాణార్థం రాజశ్యామల యాగం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల లక్ష్మీవినాయక ఆలయంలో ఆదివారం లోక కల్యాణార్థం శ్రీ రాజశ్యామల యాగం నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి, జగదాంబ దంపతులు మంగళ ధ్వని, వేద మంత్రాల నడుమ శైవాగమ సంప్రదాయంలో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాగం చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య శర్మ, ప్రణతి, బాలానందస్, శ్రీ గురు పాద సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల ఆందోళన



బక్కన్నపాలెంలో ఆందోళన చేస్తున్న రైతులు

మధురవాడ : డీ ఫారం భూములు కోల్పోయిన బక్కన్నపాలెం, కొమ్మాది, రేవళ్లపాలెం రైతులకు న్యాయం చేసిన తర్వాతే ఆ భూముల్లో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్లు ఇతరులకు కేటాయించాలని రైతులు ఆందోళన చేపట్టారు. బక్కన్నపాలెం జవహర్ నవోదయ వద్ద నిర్మించిన ఇళ్లు వేరే ప్రాంతాల వారికి కేటాయించారని, వారు స్వాధీనం చేసుకోవడానికి రావడంతో విషయం తెలుసుకున్న రైతులు ఆదివారం అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు ఇవ్వకుండా మోసం చేయడం సరికాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేంత వరకు కదిలేది లేదంటూ రైతులు భీష్మించుకుని కూర్చున్నారు.

ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొనడంతో పీఎం పాలెం పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ ఎవ్వరూ లోపలికి వెళ్లకుండా చర్యలు చేపడతామని గేటుకు తాళం వేశారు. ఇక్కడ 151 మందికి ఇళ్లు కేటాయించామని, ఇంకా 150 ఇళ్లు ఉన్నాయని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని హౌసింగ్ ఈఈ విజయలక్ష్మి హామీ ఇచ్చారు. ఆందోళనకారులకు సీపీఎం, ఎంఆర్‌పీఎస్ నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సర్వే నంబరు 96 నుంచి 101 వరకు 80 ఎకరాల భూమి పోలీసు శిక్షణ కేంద్రం, జవహర్ నవోదయ, సెరి కల్చర్, దివ్యాంగుల ఐటీఐ, ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం అప్పటి ప్రభుత్వం తీసుకుని ఏర్పాటు చేసిందన్నారు. రైతలకు మాత్రం న్యాయం చేయలేదన్నారు. దీంతో రైతులు 2017లో హైకోర్టులో కేసు వేయగా భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు ఇవ్వాలని ఆదేశించారన్నారు. అయినా రైతులకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికే చాలా సార్లు మోసం చేశారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, సియాద్రి పైడితల్లి, ఎంఆర్‌పీఎస్ నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్య వల్లరి

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన హాస్య వల్లరి ఆహుతులను కడుపుబ్బా నవ్వించింది. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్.రామానుజం పర్యవేక్షణలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వీటిలో వైఫై పాస్‌వర్డ్, టైమెంత, పనిమనిషి, ఎందుకలా ఏడుస్తున్నావ్, క్రికెట్ పిచ్చి, బామ్మగారు కోర్టు సీను, భోషాణం పెట్టె, నా హృదయం కొట్టేసారు, మిఠాయి సత్యం, షాపింగ్‌కు వెళ్తున్నా ఏం కావాలి, పెళ్లి రెండు స్వీట్లు, వాడు మన స్టాఫ్ కాదు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. కళాకారులు రావి గోపీకృష్ణ, రామానుజం, భానుప్రకాష్, డి.ఎస్.ఎన్.మూర్తి, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, నాగగణేష్, నాయుడు, శివజ్యోతి, ప్రసన్న స్కిట్లు ప్రదర్శించి అలరించారు.

బాలికల పాపా హోమ్‌కు రెండు కంప్యూటర్ల వితరణ

సీతమ్మధార : రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్సార్ నిధుల నుంచి రెండు కంప్యూటర్లను సీతమ్మధారలోని బాలికల పాపా హోంకు వితరణ చేశారు. ఆదివారం పాపా హోం నిర్వాహకులకు కంప్యూటర్లను రోటరీ క్లబ్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపా హోంలోని బాలికల విద్యాభివృద్ధికి ఉపయోగపడేలా కంప్యూటర్లు అందించామన్నారు. రోటరీ క్లబ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ అతిథి మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పూన మురళీకృష్ణ మాట్లాడుతూ బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ బారిన పడకుండా ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ నిధులతో వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా గల ఎంఎల్‌బీటీ స్కూల్‌కు రూ.2.50 లక్షలతో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పుఘర్ వద్ద గల ఫిషర్మన్ ప్రైమరీ స్కూల్‌కు రూ.1.20 లక్షలతో డైనింగ్ షెడ్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు డి.వి.వర్మ, ఎన్ఎస్ఎన్ రాజు, కె.వి.రమణ, హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశ్‌రావు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, బాలికలు పాల్గొన్నారు.